# కల - ఇల

## త్రిమూర్తి

"కమలా - కమలా - క-మ-లా-" అప్పుడే ఆఫీసునుండి వచ్చిన కృష్ణమూర్తి భార్యను పిలిచాడు.

"అబ్బబ్బ! ఏమిటండీ? .... కొంప లంటుకుపోతున్నట్టు ఏమిటా గావు కేకలు." వంటింట్లోంచి తడిచేయి చీర కొంగుకు తుడుచుకుంటూ గబగబా వచ్చింది కమల.

"గావుకేకలు కాదు కమలా, ....గుడ్ న్యూస్! వెరీగుడ్ న్యూస్!!"

"ఏమిటండీ గుడ్ న్యూస్?"

"చెప్పుకో చూద్దాం."

"మీ నాన్నగారూ, మీ అమ్మగారూ వస్తున్నట్టు టెలిగ్రాం వచ్చిందా?"

"ఊహూ-కాదు-"

"మరి?....ఫారిన్‌లోవున్న మీచిన్ననాటి స్నేహితుడు వస్తున్నాడా?"

"ఊహూ-కాదు-"

తను ఎన్ని చెప్పినాసరే భర్త 'కాదు' అనేసరికి కమలకి ఉడుకుమోత్తనం వచ్చి.-"అబ్బబ్బ! చెప్తే చెప్పండి! లేకపోతే లేదు. అంతే!" అంటూ విసురుగా లోపలకు వెళ్ళబోయింది.

నల్లని త్రాచుపాములాంటి కమల జడను పట్టుకుని ఆపేడు కృష్ణమూర్తి.

"అబ్బా?" అంటూ ఆగిపోయింది.

"ఊఁ. ఇప్పుడు చెప్పు!....లేదా, నేను చెప్పలేను మహాప్రభో! ఆ గుడ్ న్యూసేదో మీరే చెప్పండి. అంటే, నేనే చెప్తాను....ఊఁ చెప్పు! ...."

"నేను చెప్పలేను మహాప్రభో! ఆ గుడ్ న్యూసేదో మీరే చెప్పండి."

కమలకింకా ఉడుకుమోత్తనం వచ్చి కళ్ళల్లో నీళ్ళుసుళ్ళు తిరిగాయి.

కృష్ణమూర్తి అదేంగమనించకుండా-

"ప్రస్తుతం నేను చేసే ఉద్యోగం ఏమిటి?" అని అడిగాడు.

"నాకు తెలియదు మహాప్రభో; అని అంటున్నాను గదండీ!" ఉడుకుమోత్తనంతో విసురుగా అంది కమల.

"అంటే, శ్రీమతి గారికి, శ్రీవారు ఏం ఉద్యోగం చేస్తున్నారో కూడా

తెలియదన్నమాట." భార్యను ఇంకా ఏడిపించాలని వ్యంగ్యంగా అన్నాడు కృష్ణమూర్తి.

"కాలేజీలో యల్.డి.సి."

"ఇప్పుడు యు.డి.సి.గా ప్రమోషన్ వచ్చింది."

"అబ్బ! ఇంత మంచి గుడ్ న్యూస్ చెప్పడానికి ఎంత విసిగించారండి!" ఇందాకటి విసుగు, ఉడుకుమోత్తనం లేవు. ఆమె ముఖం వెయ్యి కాండిల్స్ బల్బులా వెలిగి పోతోంది.

కమల చీర కొనమని మూడు నెలల నుంచి అడుగుతుంది. 'నాకు ప్రమోషన్ వచ్చిన తరువాత కొంటానంటూ' గడుపుకు వచ్చేశాడు కృష్ణమూర్తి.

ఆ విషయం జ్ఞాపకం వచ్చి-

"శ్రీవారు యు. డి. సి. అయ్యేరు కదామరి, శ్రీమతి గారి కానుక ఏం చేశారు?" అడిగింది కమల.

"నేను మర్చిపోతానా?.. యిదిగో" అంటూ ఆఫీసు నుండి వచ్చేటప్పుడు కొన్న కొత్తచీర, మల్లెపూలపొట్లం ఆమె చేతికిస్తూ- "మరి, శ్రీవారి కానుక...." అంటూ దగ్గరకి లాక్కోబోయాడు కృష్ణమూర్తి.

"ఛీ! పోదురూ...." అంటూ దూరంగా జరిగింది.

"ఆ కొత్త చీర కట్టుకొని, తల్లో మల్లె పూలు పెట్టుకొని త్వరగా రెడీ అవ్వు! సినిమాకి వెడ్దాం."

పది నిముషాల్లో ముస్తాబై వచ్చింది కమల.

కమలని చూస్తూ శిలాప్రతిమలా నిలుచుండి పోయాడు కృష్ణమూర్తి.

"అలా చూస్తున్నారేమిటండీ! ఈ చీర నాకేం బాగాలేదా? చెప్పండి!.... ఇంకో చీర మార్చుకుంటాను." భర్త అలా ఎందుకు చూస్తున్నాడో తెలియక అంది కమల.

"వద్దు కమలా! వద్దు!!.... ఈ చీర నీకెంత బాగుందో తెలుసా!.... అసలు నీకీ చీర యింతగా మ్యాచ్ అవుతుందని నేననుకోలేదు.... నిజంగా ఈ చీరలో నువ్వెంత అందంగా వున్నావో తెలుసా? వర్ణించడం ఆ కాళిదాసు తరం కూడా కాదు" అంటూ ఆమెను కౌగిలించుకున్నాడు.

"ఛీ! వదలండీ! సినిమాకి టైం అయి పోతుంది." కోపం, సిగ్గూ అభినయిస్తూ అంది కమల.

ఇంటికి తాళం వేసి, రిక్షా ఎక్కారు కృష్ణమూర్తి, కమల.

టిక్కెట్లు తీసుకొని లోపలకు వెళ్ళి ఎవరూ చుట్టు ప్రక్కల లేని ఓ మూలకు పోయి కూర్చున్నారు- యిద్దరూ.

సినిమా మొదలయింది. కథలో లీనమయింది కమల. అరగంట గడిచింది.... కృష్ణమూర్తి, కమల చేతిని తన చేతిలోకి తీసుకొని మృదువుగా నొక్కాడు.

"ఛీ! వదలండీ! ఎవరైనా చూస్తే బాగోదు." చిరుకోపంతో సుందలిస్తూ అంది కమల.

"వాళ్ళు సినిమా చూడ్డానికి వచ్చారు గాని, మనల్ని చూడ్డానికి కాదుగా!.... అయినా, ఎవరున్నారిక్కడ?" అంటూ ఆమె మెడ చుట్టూ చేతులు వేసి దగ్గరకు లాక్కున్నాడు కృష్ణమూర్తి.

* * *




"ఏయ్; లెగు !.... మొగుడొచ్చాడు భోజనం వడ్డించాలని తెలియదూ !.... పందిలాగ పడుకున్నావ్. లెగు !...." భర్త రాక కోసం ఎదురు చూసి, చూసి ఎంతకీ రాక పోయేసరికి తలుపుకి జార గిలబడి పడుకున్న కషలను రెండు దెబ్బలు కొట్టి లేపాడు కృష్ణమూర్తి.

అప్పుడు కలలోంచి ఇలలోకి వచ్చింది కషల.

ఉలిక్కిపడి లేచింది కమల చుట్టూ చూసింది. ఇదేమిటి ? తను ఇక్కడుందే మిటి ? తను, తన భర్తతో కలిసి సినిమాకి వెళ్ళలేదా? తనభర్తకి యు.డి.సి గా ప్రమోషన్ రాలేదా ? మరి, ఈ కొత్త చీర ఎందుకు తెచ్చినట్టు ?.... తను కట్టుకున్న చీరను చూసుకుంది.... లేదు తను కట్టుకున్నది కొత్తచీరకాదు పాతది– అతుకుల చీర అంటే, తను ఇంతవరకూ కలకన్నదన్నమాట.

"లేచి భోజనం వడ్డించు!" కసురుకున్నాడు కృష్ణమూర్తి.

మౌనంగా లేచి భర్తకి భోజనం వడ్డించింది కమల.

కృష్ణమూర్తి భోజనం దగ్గర కూర్చొని, కూర, అన్నంలో కలుపుకొని ఒక ముద్ద తిన్నాడో లేదో– "ఇదసలు కూరేనా ? లేకపోతే గడ్డా?.... ఛీ! ఛీ !! నీ కసలు కూర వండడం వచ్చా?" అంటూ కమలని తిట్టి కొట్టి, విసురుగా వెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

కలలో కృష్ణమూర్తి ఆఫీసు వదలగానే ఇంటికి వచ్చి, తనని సినిమాకి, షికారుకీ తీసుకు వెళ్ళాడు.... ఇలలో కృష్ణమూర్తి ఆఫీసు వదలగానే ఇంటిని రాకుండా ఏ క్లబ్బులోనో తాగి, తందనాలాడి అర్ధరాత్రి దాటాక ఇంటికి వచ్చి తనని నరకానికి తీసుకువెళ్ళాడు.

కలలో కృష్ణమూర్తికీ ఇలలో కృష్ణమూర్తికీ ఎంత తేడా ?

గాఢంగా నిట్టూర్చింది కమల.